సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 17, మే, 2023



డెంగీ రహిత జిల్లాగా మార్చుకుందాం
ప్రజలను చైతన్యవంతులను చేసి నెల్లూరును డెంగీ రహిత జిల్లాగా మార్చుకుందామని డీఎంహెచ్ఓ పెంచలయ్య తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని మంగళవారం నెల్లూరులో నిర్వహించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,658
3 శాతం జీఎస్టీతో	రూ.5,828
నవర (8 గ్రా)	రూ.46,624

వాతావరణం
గరిష్టం/కనిష్టం 43.0 /31.2

మంగళవారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. గాలిలో 26 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

వామ్మో ఎండలు
- ఏఎస్‌పేట, కలిగిరి మండలాల్లో 45 డిగ్రీలు
- నెల్లూరులో 43



నెల్లూరులో గొడుగు వేసుకుని వెళ్తున్న యువతి

నెల్లూరు(దర్గామిట్ట): అధిక ఉష్ణోగ్రతలు ప్రజలను భయపెడుతున్నాయి. ఎండ వేడిమి, గాలుల నేపథ్యంలో బయటకు వచ్చేందుకు భయపడుతున్న పరిస్థితులున్నాయి. జిల్లాలో సోమవారం భానుడు నిప్పుల కొలిమిని తలపించగా మంగళవారం కూడా అదే పరిస్థితి కొనసాగింది. నెల్లూరులో గరిష్ట ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అదే ఏఎస్‌పేట, కలిగిరి తదితర మండలాల్లో అత్యధికంగా 45 డిగ్రీలకు చేరింది. వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతకు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న వేళ నెల్లూరులో అనేక రోడ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి.

సోమశిలలో 46.522 టీఎంసీలు



చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 46.522 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 195 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 2,450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 300, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 95.619 మీటర్లు ఉంది.

సకాలంలో స్పందన అర్జీలకు పరిష్కారం
- డీపీఓ సుస్మితారెడ్డి



నెల్లూరు(పొగతోట): ప్రజలు స్పందన కార్యక్రమంలో ఇచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీపీఓ సుస్మితా రెడ్డి ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో డీపీఓ మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించి సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్న ప్రాంతాల కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల్లో సక్రమంగా బ్లీచింగ్ చేయాలన్నారు. ప్రతి 15 రోజులకొకసారి శుభ్రం చేయాలని తెలిపారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి 981 దరఖాస్తులు
నెల్లూరు(టౌన్): విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం 981 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రెండో విడత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈనెల 15వ తేదీతో ముగిసింది. 981 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 617 మంది వివిధ పాఠశాలలను కోరుకున్నారు. దరఖాస్తులను పరిశీలించి ఈనెల 19వ తేదీన అర్హులైన వారికి సీట్లు కేటాయిస్తామని డీఈఓ గంగాభవాని మంగళవారం తెలిపారు.

'రైతు భరోసా'కు 18 వరకు గడువు
నెల్లూరు(సెంట్రల్): రైతు భరోసా పథకానికి సంబంధించి అర్హులుంటే పేర్ల నమోదుకు ఈనెల 18వ తేదీ వరకు గడువు ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు తమకు సమీపంలోని ఆర్బీకేల్లో అన్ని పత్రాలిచ్చి సరిచేసుకోవాలని సూచించారు. అలాగే పీఎం కిసాన్ నగదు కోసం రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఆర్బీకేల్లో ఉన్న వీఏఏలకు పూర్తి సమాచారాన్ని అందించాలని తెలియజేశారు.

ఏళ్ల కల.. సాకారం దిశగా..

జాతీయ రహదారి.. కందుకూరు నియోజకవర్గ వాసుల ఎన్నో సంవత్సరాల కల. ఇది త్వరలోనే నెరవేరనుంది. వైఎస్సార్ జిల్లా మైదుకూరు నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వరకు నూతన హైవే 167బీ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా వలేటివారిపాళెం మండలం మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు మొదటిదశ రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి.



వలేటివారిపాళెం మండలం కూనిపాళెం వద్ద జరుగుతున్న పనులు

ఎన్‌హెచ్ 167బీ నిర్మాణానికి చర్యలు
- మూడు లేన్లుగా విస్తరణ
- మైదుకూరు నుంచి సింగరాయకొండ వరకు హైవే
- మొదటిదశలో మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు..
- వేగంగా జరుగుతున్న మొదటి ప్యాకేజీ పనులు

కందుకూరు: జాతీయ రహదారి 167బీలో భాగంగా మొదటి ప్యాకేజీ నిర్మాణ పనులు నెలరోజులుగా జోరుగా సాగుతున్నాయి. మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు రహదారి నిర్మాణానికి రూ.310 కోట్ల అంచనాలతో టెండర్లు పిలవగా 23 శాతం లెస్‌తో రూ.240 కోట్లకు వల్లభనేని కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులను దక్కించుకుంది. 110 ఎకరాల భూసేకరణకు రూ.36 కోట్లను నిర్వాసితులకు చెల్లించారు. అలాగే మాలకొండ వద్ద ఉన్న అటవీ భూముల సేకరణ నేపథ్యంలో ఆ శాఖకు మరో రూ.6.1 కోట్లు చెల్లించనున్నారు. అనుమతులు పూర్తి కావడంతో కాంట్రాక్ట్ సంస్థ క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను ప్రారంభించింది. ప్రస్తుతం వలేటివారిపాళెం మండలంలోని మాలకొండ నుంచి బడేవారిపాళెం వరకు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పాత రోడ్డును మూడు లేన్లుగా రోడ్డుగా విస్తరించనున్నారు. మేజర్ బ్రిడ్జిలున్న ప్రాంతాల్లో అప్రోచ్ రోడ్లను నిర్మించడంతోపాటు పెద్దఎత్తున విస్తరణకు గ్రావెల్ తోలే పనులు చేపడుతున్నారు.



రోడ్డు నిర్మాణంలో భాగంగా గ్రావెల్ తోలుతున్న దృశ్యం

ఇలా..

వైఎస్సార్ జిల్లా మైదుకూరు వద్ద ఉన్న ఎన్‌హెచ్ 67 నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వద్ద ఉన్న ఎన్‌హెచ్ 16ని కలుపుతూ 189 కి.మీ. మేర ఉన్న రోడ్డును నూతనంగా జాతీయ రహదారి 167బీగా గుర్తించారు. దీనిని జాతీయ రహదారి ప్రమాణాలకు అనుగుణంగా మొత్తం రూ.2 వేల కోట్లతో విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా రోడ్డు పనులను మొత్తం నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ నెల్లూరు జిల్లా మాలకొండ నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వరకు, రెండో ప్యాకేజీ మాలకొండ నుంచి సీఎస్పురం వరకు, 3వ ప్యాకేజీ కింద సీఎస్‌పురం నుంచి కడప వరకు, 4వ ప్యాకేజీ కడప నుంచి ముదిరెడ్డిపల్లి జంక్షన్ వరకు ఉన్నాయి. ముదిరెడ్డిపల్లి నుంచి తిరిగి మైదుకూరు వరకు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. మొత్తం నాలుగు ప్యాకేజీల కింద 3 లేన్ల రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. భూసేకరణ, అటవీ శాఖ క్లియరెన్స్, రోడ్డు నిర్మాణ పనులకు కలిపి రూ.2 వేల కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు.

త్వరలో కందుకూరు బైపాస్ పనులు

మొదటి ప్యాకేజీ కింద నిర్మించనున్న 45 కి.మీ. రోడ్డు 30 మీటర్ల వెడల్పు ఉంటుంది. మాలకొండ నుంచి సింగరాయకొండ మధ్య నాలుగు చోట్ల బైపాస్ రోడ్డు నిర్మాణాలు రానున్నాయి. వీటిలో కందుకూరు పట్టణానికి దక్షిణం వైపు వచ్చే బైపాస్ ప్రధానమైంది. పట్టణం చుట్టూ 8.9 కి.మీ. మేర అర్ధచంద్రాకారంలో బైపాస్ ఉండేలా ప్రణాళిక వేశారు. పామూరు రోడ్డు నుంచి కొండముడుసుపాళెం వద్ద ఉన్న గుడ్లూరు రోడ్డు మీదుగా చుట్టుగుంట రోడ్డు దాటి సీటీఆర్ఐ వద్ద ఓవీ రోడ్డులో కలుస్తుంది. ప్రధాన రోడ్లు కలిసే చోట్ల సుందరంగా ఉండే విశాలమైన నూతన జంక్షన్లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే చుండి గ్రామం సమీపంలో 1.5 కి.మీ., వలేటివారిపాళెం బయట 1.8 కి.మీ., బడేవారిపాళెం వద్ద 1.3 కి.మీ. మేర బైపాస్ రోడ్లు రానున్నాయి.

4 లేన్లకు ప్రతిపాదనలు

167బీ జాతీయ రహదారి మొత్తం మూడు లేన్లుగా నిర్మాణం చేయనున్నారు. అయితే కందుకూరు నుంచి సింగరాయకొండ వరకు ఉన్న 12 కి.మీ. రోడ్డును మాత్రం నాలుగు లేన్లు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కోరుతున్నారు. దీనికి సంబంధించి అధికారుల ద్వారా ప్రతిపాదించారు. ఈ కారణంతోనే ప్రస్తుతం కందుకూరు నుంచి సింగరాయకొండ మధ్య పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం డబుల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారి నిత్యం రద్దీగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని నూతన రహదారిని నాలుగు లేన్లుగా వేయాలనే డిమాండ్ ఉంది. అలాగే కందుకూరు పట్టణం చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని కూడా త్వరలో ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వివరాలిలా..
- రహదారి నిర్మాణం : 189 కి.మీ
- నిధులు : రూ.2 వేల కోట్లు
- మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు : 45.73 కి.మీ
- నిధులు రూ.240 కోట్లు
- కందుకూరు పట్టణంలో జరిగే నిర్మాణం : 9 కి.మీ

వేగంగా పనులు

ఎన్‌హెచ్ 167బీ జాతీయ రహదారి పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అలాగే కీలకమైన కందుకూరు పట్టణ బైపాస్ నిర్మాణాన్ని కూడా త్వరలో మొదలు పెట్టేందుకు కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారులు కూడా త్వరగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేస్తాం. మిగిలిన మూడు ప్యాకేజీల పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

– సుమన్, ఎన్‌హెచ్ జేఈ

ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం



జాతీయ రహదారి నిర్మాణం కోసం చాలా సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాం. ప్రస్తుతం పనులు ప్రారంభించి రోడ్డు వేయడం ఆనందం ఉంది. ఈ రోడ్డుతో మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు ప్రయాణం చాలా సులువుగా ఉంటుంది. అలాగే వలేటివారిపాళెం, కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ కూడా తగ్గుతుంది. హైవే పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలి.

– దేగా వెంకటేశ్వర్లు, వ్యాపారి, అయ్యవారిపల్లె

మెరుగైన రవాణా వ్యవస్థ



చాలా కాలంగా ఎదురుచూస్తున్న జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతుండడం మంచి పరిణామం. కందుకూరు నుంచి మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి హైవే రోడ్డు సౌకర్యం వస్తుంది. సింగరాయకొండ జాతీయ రహదారితో కలపడం వల్ల ఈ ప్రాంతం నుంచి నెల్లూరు, ఒంగోలు వంటి ప్రాంతాలకు వెళ్లే వారికి ప్రయాణం సులువుగా కూడా ఉంటుంది. అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్య కొంతవరకు తగ్గుతుంది.

– గుత్తా గోపి, రైతు, వలేటివారిపాళెం

మత్స్యకార కుటుంబాలకు అండగా..

- వైఎస్సార్ మత్స్యకార భరోసా నిధుల విడుదల
- నెల్లూరులో మెగా నమూనా చెక్కు అందజేత

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలకు అండగా ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకానికి సంబంధించి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేసే కార్యక్రమాన్ని బాపట్ల జిల్లా నిజాంపట్నంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణం నుంచి సీఎం సభను అరుణమ్మ, కలెక్టర్ ఎం.హరినారాయణన్, తదితరులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. స్మార్ట్ కార్డుల ద్వారా నేరుగా బంకుల్లో డీజిల్ పొందే అవకాశం కల్పించిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నాలుగు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. మన జిల్లాలో జువ్వలదిన్నెలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులు త్వరలో పూర్తవుతాయని, దీనిని ప్రారంభిస్తారన్నారు. కావలి నియోజకవర్గంలో 4,912 మంది, కోవూరులో 3,028 మంది, సర్వేపల్లిలో 1,800 మంది, కందుకూరు నియోజకవర్గంలో 2,332 మంది వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సంయుక్త సంచాలకుడు ఎం.నాగేశ్వరరావు, ఏడీలు విజయకృష్ణ, శ్రీనివాసులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మెగా నమూనా చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్, అధికారులు

జిల్లాలో..
- ఎంతమందికంటే.. : 12,072 మంది
- నిధులు : రూ.12.7 కోట్లు

ఆనందంగా ఉంది



జగనన్న ప్రభుత్వంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద రూ.10 వేలు నా బ్యాంక్ ఖాతాలో జమ కావడం ఎంతో ఆనందంగా ఉంది. గత పాలకులు వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలను పట్టించుకోలేదు.

– మామిడి గోవిందస్వామి, బంగారుపాళెం, బోగోలు మండలం

గత ప్రభుత్వాలు విస్మరించాయి



గత ప్రభుత్వాలు వేట నిషేధ సమయంలో ఎన్నడూ మత్స్యకారులను పట్టించుకున్న దాఖలాల్లేవు. గుర్తింపు కార్డుల కోసం గతంలో మత్స్య శాఖ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాం. ముఖ్యమంత్రి జగనన్న నేరుగా మా బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేయడంతో భృతికి ఇబ్బంది లేకుండా పోయింది.

– నాయుడు సురేష్, కుడితిపాళెం, ఇందుకూరుపేట మండలం

ఆదుకున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులను ఆదుకుంటున్నారు. వేట నిషేధ సమయంలో అప్పులు తెచ్చుకుని బతికేవాళ్లం. నేడు ప్రభుత్వం మా బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేసి అప్పులు తెచ్చుకోకుండా ఆదుకుంటోంది.

– వాయల తిరుపతి, అలగాయపాళెం, ఉలవపాడు మండలం

ఏపీఈఏపీ సెట్‌కు 50 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఏపీఈఏపీ సెట్‌కు మంగళవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం నాలుగు కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. ఉదయం జరిగిన ఎగ్జామ్‌కు 738 మందికి గానూ 714 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 738 మందికి గానూ 712 మంది హాజరయ్యారు. మొత్తంగా 96.61 శాతం హాజరు నమోదైంది.

నేడు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో ఖాళీలున్నాయని, ఆటోనగర్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలియజేశారు.

నలుగురికి జీవిత ఖైదు

- పొలం వివాదంలో ముగ్గురి హత్య కేసు
- 2016లో కలిగిరి మండలంలో ఘటన
- ఒకే కుటుంబానికి చెందిన వారికి శిక్ష
- మరో ముగ్గురిపై రుజువు కాని నేరం

నెల్లూరు(లీగల్): పొలం యాజమాన్య హక్కుల విషయంలో ఇరువర్గాల నడుమ వివాదం ఏర్పడింది. దీంతో ప్రత్యర్థి వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులను హత్య చేసిన కేసులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరులోని మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కపర్ది మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నెల్లూరు నగర పరిసర ప్రాంతాలకు చెందిన ఎస్.మహేంద్రరెడ్డి, కొండేటి సుబ్బారెడ్డికి కలిగిరి మండలం వెంకన్నపాళెం గ్రామం వద్ద కొంత భూమి ఉంది. సమీపంలోని పాపన ముసలిపాళెం గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీదేవమ్మ తదితరులు ఆ పొలం తమదని వారితో వివాదం పెట్టుకున్నారు. దీంతో మహేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి స్థానిక కావలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి 2016లో ఆ పొలంలోకి ఎవరూ ప్రవేశించకుండా ఇంజక్షన్ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అప్పటి నుంచి నిందితులు ప్రత్యర్థులపై ఆగ్రహంతో కక్ష పెంచుకున్నారు.

ఆ రోజు ఏం జరిగిందంటే..

మహేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, వారి స్నేహితుడు వెంకటసుబ్బారెడ్డి 2016 సంవత్సరం అక్టోబర్ 21 మధ్యాహ్నం వివాదాస్పద పొలంలోకి వెళ్లారు. వారిని గమనించిన పాపన ముసలిపాళెం గ్రామస్తులైన గణేశం శ్రీనివాసులురెడ్డి, గణేశం వెంకటేశ్వర్‌రెడ్డి, గణేశం జనార్దనరెడ్డి, గణేశం సుబ్బారెడ్డి, లక్ష్మీదేవమ్మ, సుబ్బమ్మ, పద్మ కారంపొడి, కర్రలతో పొలంలోకి వచ్చారు. ఇరువర్గాల నడుమ మాటామాటా పెరిగి మహిళలు తమ చేతుల్లోని కారంపొడిని ప్రత్యర్థుల కళ్లల్లో కొట్టారని అప్పట్లో ఫిర్యాదులో పేర్కొన్నారు. మిగిలిన వారు కర్రలతో విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన మహేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి అక్కడికక్కడే మరణించారని మహేంద్రరెడ్డి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో గణేశం శ్రీనివాసులురెడ్డి, గణేశం వెంకటేశ్వర్‌రెడ్డి, గణేశం జనార్దనరెడ్డి, గణేశం సుబ్బారెడ్డిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.1,000 వంతున జరిమానా విధించారు. లక్ష్మీదేవమ్మ, సుబ్బమ్మ, పద్మపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసును కొట్టేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కుడుముల రవి కుమార్ కేసు వాదించారు.

మూడు పొగాకు బ్యారెన్ల దగ్ధం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం
- రూ.80 లక్షలకు పైగా నష్టం



బ్యారెన్ల వద్ద ఎగసిపడుతున్న మంటలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మూడు పొగాకు బ్యారెన్లతోపాటు బేళ్లు కట్టి ఉన్న పొగాకు చెక్కులు 30కి పైగా అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో రూ.80 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. రైతులు చెరుకూరు పెద కామాక్షయ్య నాయుడు, చెరుకూరు చిన్నా నాయుడుతోపాటు హజరత్తయ్యకు చెందిన మూడు పొగాకు బ్యారెన్లలో క్యూరింగ్ జరుగుతోంది. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మూడు బ్యారెన్లు పక్కపక్కనే ఉండడంతో మంటలను అదుపు చేయడం స్థానికులకు సాధ్యం కాలేదు. దీంతో పక్కనే క్యూరింగ్ చేసి వేలానికి సిద్ధంగా ఉంచిన పొగాకు బేళ్లకు మంటలు వ్యాపించి కాలిపోయాయి. బ్యారెన్లలో ఉన్న పొగాకును బయటికి తెచ్చేందుకు ప్రయత్నించిన రైతు చెరుకూరు చిన్నా నాయుడు చేతులు సైతం కాలాయి. దీంతో వెంటనే ఆయన్ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి రమేష్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే ఎండ, వడగాల్పులతో నష్టం జరిగిపోయిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డీసీపల్లి పొగాకు బోర్డు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, ఆర్ఐ ఖాసీం, వార్డు కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చెరుకూరు కామాక్షయ్య నాయుడు, సీహెచ్ శ్రీనివాసులు నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

తాటిచెట్ల అక్రమ నరికివేత

వృక్షో రక్షతి రక్షితః అని పెద్దలు ఊరికే చెప్పలేదు. పది మందికి నీడనిచ్చే చెట్లను నరికితే నిలువ నీడ లేకుండా పోతుందని ప్రస్తుత సమాజానికి ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికి కలపను తరలిస్తున్నా అడిగేవారు కరువయ్యారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తాటిచెట్లకు సైతం రక్షణ కరువైంది.

- ప్రభుత్వ భూముల్లోని చెట్లను కూల్చేస్తున్న అక్రమార్కులు
- తమిళనాడుకు తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు


తాటిచెట్లను నరికి ఒక చోట వేసిన మొద్దులు

చేజర్ల: ఒక చెట్టును నరకాలంటే మూడు మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే చెట్లను నరికి కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో తాటి చెట్లను సైతం నరికేస్తున్నారు. కండలేరు జలాశయం ఎగువ ప్రాంతం చేజర్ల మండలంలోని నెర్నూరు, కొలపనాయుడుపల్లి గ్రామాల పరిధిలో కండలేరు జలాశయం చివరన వందలాది తాటిచెట్లను ఇష్టారాజ్యంగా నరికి, ముక్కలు చేసి చెన్నై తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇటుక బట్టీల్లో, పవర్ ప్రాజెక్ట్‌ల్లో తాటి మొద్దులను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండాపోతోంది.

ప్రభుత్వ భూముల్లో..

కండలేరు జలాశయం పరిధిలో సుమారు 20కి పైగా గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అక్కడ పొలం గట్లపై వందలాది తాటిచెట్లు ఉండేవి. జలాశయ నిర్మాణంతో ఎగువ ప్రాంతంలో జన సంచారం లేకపోవడంతో ఇది అక్రమార్కులకు అవకాశంగా మారింది. కొందరు తమిళనాడుకు చెందిన కూలీల సాయంతో కండలేరు జలాశయం చివరలో ప్రభుత్వ భూముల్లో ఉండే తాటిచెట్లను నరికి సొమ్ము చేసుకొంటున్నారు. ఇందుకు కొందరు స్థానికులు సహకరిస్తుండంతో ఈ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని పలువురు పేర్కొంటున్నారు. ముంపు ప్రాంత రైతులకు జలాశయ భూసేకరణ సమయంలో అప్పట్లో ప్రభుత్వం తాటిచెట్టుకు రూ.4 వేలు నష్టపరిహారం అందించింది. అయితే ప్రస్తుతం కొందరు ఒక్కో చెట్టుకు రూ.100 నుంచి రూ.150 వరకు తీసుకొని దళారులకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు 6 నెలలుగా తాటిచెట్ల నరికివేత, తరలింపు జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. తమిళనాడు నుంచే కూలీలతోపాటు లారీలు, ట్రాక్టర్లను తీసుకువచ్చి, తాటి మొద్దులను చెన్నై తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


తాటి మొద్దులను తరలిస్తున్న దృశ్యం

ముక్కలుగా చేసి తరలింపు

అక్రమంగా నరికిన తాటి మొద్దులను చిన్న ముక్కలుగా చేసి కండలేరు జలాశయం రోడ్డు మీదుగా రాపూరు, అక్కడి నుంచి చెన్నైకి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దాచూరు, గోనుపల్లి మీదుగా రాపూరు నుంచి చెన్నైకి మరో మార్గంలో కూడా తరలిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ రవాణా కోసం అధికారులకు సైతం మామూళ్లు ఇచ్చినట్లు కొందరు తెలపడం గమనార్హం. ఇటీవల కండలేరు జలాశయం చివరన గల నెర్నూరు సమీపంలో తాటిచెట్లను నరుకుతుండగా స్థానిక రైతులు ప్రశ్నించడంతో వారు సరైన సమాధానం ఇవ్వలేదని చెబుతున్నారు. దీనిపై రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు. ఈ అంశంపై అటవీశాఖ డీఆర్వో వెంకటప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో తాటిచెట్లను నరకడం చట్టరీత్యా నేరమన్నారు. చెట్లను నరికితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ శివకృష్ణయ్యను వివరణ కోరగా ఆ ప్రాంత వీఆర్వోకు సమాచారమిచ్చామని, చెట్లను నరకకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తాటి చెట్లను నరికే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐక్యంగా సాగితేనే ప్రగతి

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే బ్రాహ్మణ సంక్షేమం
- దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్


జ్వాలాపురం శ్రీకాంత్‌కు ఆత్మీయ సన్మానం

నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలో బ్రాహ్మణ సంఘీయులు ఐక్యంగా సాగితేనే ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రగతి సాధించవచ్చని దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారు, ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ తెలిపారు. నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పారా శ్రీధర్‌శర్మ, మువ్వా ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని బ్రాహ్మణ సంఘాల సహకారంతో పురమందిరంలో మంగళవారం జ్వాలాపురం శ్రీకాంత్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎనమండ్ర సాయిసురేష్, పూర్ణానందశర్మ, పోతావఝల పురుషోత్తమశర్మకు అభినందన సభ నిర్వహించారు. జిల్లాలో సేవా కార్యక్రమాలను నిర్వహించిన పలువురు బ్రాహ్మణ సంఘీయులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రాహ్మణులకు అండగా ఉన్నారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే బ్రాహ్మణ సంఘీయుల సంక్షేమం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో తెనాలి, ఆదోని, కర్నూలు, చిత్తూరు, విశాఖపట్నం, నెల్లూరు తదితర జిల్లాల్లో సంఘ నాయకులు చేస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయా జిల్లాల నాయకులు కౌతా వెంకటసుబ్బారావు, జ్వాలా నరసింహం, వి.మధుసూదనశర్మ, వైష్ణవిప్రసాద్, మామిళ్లపల్లి అయ్యప్ప, కుల్లూరు రవిచంద్ర, పురుషోత్తంశర్మ, రామభద్రుడు, సీతారాం, కామేశ్వరి తదితరులను అభినందించారు. ప్రతి ఒక్కరికీ తనవంతు సహాయ సహకారాలందిస్తానని, బ్రాహ్మణ, అర్చక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో నెల్లూరు ఆర్టీఓ మలోలా, వివిధ జిల్లాల నాయకులు మాట్లాడారు. అనంతరం ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

వాహనం బోల్తా

- ఎస్‌ఈబీ అధికారులకు గాయాలు


బోల్తాపడిన ఎస్‌ఈబీ అధికారుల వాహనం

పొదలకూరు: ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అక్రమ రవాణాను అడ్డుకోవాలని సోమవారం అర్ధరాత్రి హుటాహుటిన బయలుదేరిన ఎస్‌ఈబీ స్క్వాడ్ అధికారులు, సిబ్బంది రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. వివరాలు.. నెల్లూరు ఎస్‌ఈబీ స్క్వాడ్ సీఐ హుస్సేన్‌బాషా నేతృత్వంలో ఎస్సై బాలకృష్ణతో సహా నలుగురు కానిస్టేబుళ్లు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వాహనంలో బయలుదేరగా పొదలకూరు మండలంలోని తాటిపర్తికి సమీపంలో వృద్ధుల ఆశ్రమం వద్ద వారు ప్రయాణిస్తున్న వాహనం బ్రేక్ ఫెయిలై అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సీఐ, ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. కానిస్టేబుల్ వాసు తీవ్రంగా గాయపడడంతో అతన్ని చికిత్సనిమిత్తం అడిషనల్ ఎస్పీ హిమవతి పర్యవేక్షణలో అంబులెన్స్‌లో నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వాసుకు శస్త్రచికిత్స చేసినట్టు సమాచారం. ప్రమాదం జరిగిన తర్వాత పొదలకూరు ఎస్‌ఈబీ సీఐ వెంకట్రావ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్‌ఈబీ సిబ్బందిని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పరామర్శించారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

పొదలకూరు : మండలంలోని అయ్యగారి పాళెం గిరిజనకాలనీలో నివసిస్తున్న వివాహిత మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. గ్రామస్తుల వివరాల మేరకు.. గిరిజన కాలనీకి చెందిన వెల్లంపల్లి లక్ష్మి(30) ఇంట్లో బట్టలు ఉతికి ఆరేస్తున్న సమయంలో విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై మృతిచెందింది. లక్ష్మికి భర్త శ్రీనివాసులు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

తాటిచెట్టుపై నుంచి పడి..

అనుమసముద్రంపేట: తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఏఎస్‌పేట మండలం జమ్మవరంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. జమ్మవరం ఎస్సీకాలనీకి చెందిన గంగపట్ల వెంకటరమణయ్య(34) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. తాటిచెట్లు ఎక్కి కాయలు కోసి అడిగిన వారికి ఇచ్చి నగదు తీసుకుంటాడు. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి వారి పొలంలో తాటి కాయలు కోయమని కోరగా చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో చికిత్సనిమిత్తం అతనిని ఆత్మకూరులో ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. వెంకటరమణయ్య భార్య రజిత ప్రస్తుతం నిండు గర్భిణి. ఆయన మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న ఎస్సై నరేష్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

ప్రతి కుటుంబానికి సంపూర్ణ వైద్యసేవలు

- కలెక్టర్ ఎం.హరినారాయణన్


మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): గ్రామాల్లో ప్రతి కుటుంబానికి సంపూర్ణ వైద్యసేవలు అందించాలనే బృహత్తర లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను ప్రభుత్వం రూపొందించిందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల వైద్యసేవల గురించి పీహెచ్‌సీ వైద్యాధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందించగలిగితే భవిష్యత్ తరాలు బాగుంటాయనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ రెండు విభాగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గ్రామాలను సందర్శించే ముందు తప్పనిసరిగా ఏఎన్ఎం, వలంటీర్ల ద్వారా ఆయా గ్రామస్తులకు ముందుగానే సమాచారం అందించాలని తెలిపారు. కేవలం గణాంకాలు ముఖ్యం కాదని, ప్రతి కుటుంబానికి ఏ మేరకు వైద్యసేవలు అందిస్తున్నామనే ఆలోచన ఉండాలన్నారు. గర్భిణులకు రిజిస్ట్రేషన్ దశ నుంచి చెకప్, డెలివరీ అయి ఇంటికి చేరే వరకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సేవలు ప్రతి తల్లికి అందాలన్నారు. బాలింత ఇంటికి వెళ్లేటప్పుడు వారి బిడ్డకు సంబంధించిన జనన ధ్రువీకరణ పత్రం అందించాలన్నారు. టీబీతో బాధపడుతున్న రోగుల ఇళ్లను సందర్శించాలని, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి బరువు తక్కువగా ఉండే పిల్లలకు సంబంధించి తగు సూచనలు చేయాలని తెలిపారు. అలాగే 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ రహిత జిల్లాగా మార్చుకుందాం

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ప్రజలను చైతన్యవంతులను చేసి తద్వారా నెల్లూరును డెంగీ రహిత జిల్లాగా మార్చుకుందామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి గుప్తాపార్కు మీదుగా తిరిగి డీఎంహెచ్‌ఓ కార్యాలయం వరకు డెంగీపై అవగాహన కల్పిస్తూ వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు, పీఎంపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ డెంగీ, చికున్ గున్యా, మలేరియా లాంటి వ్యాధులన్నీ దోమల ద్వారానే వ్యాప్తి చెందుతున్నాయని, దోమలు కుట్టకుండా, పుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారానికొకరోజు ఫ్రైడేని డ్రైడేగా పాటించి ఆ రోజు ప్రజలందరూ తమ ఇళ్లలో నీరు నిల్వ లేకుండా తొట్టెలు ఖాళీ చేసి ఎండపెట్టాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డెంగీ లాంటి వాటిపై నిత్యం ప్రజలను చైతన్యం చేయాలని వైద్యశాఖ సిబ్బందికి సూచించారు. సమావేశంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, డాక్టర్ సునీల్, డెమో అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో అధికారి కనకరత్నం, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ పెంపొందించాలి

- వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి


మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ సుందరవల్లి

వెంకటాచలం: విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించే బాధ్యతను కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు తీసుకోవాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరులో ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో మంగళవారం కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌పై ప్రభుత్వ, ప్రైవేట్ అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి పాటుపడాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌ను పక్కాగా అమలు చేయించే బాధ్యత కళాశాలలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు (క్రైమ్): ఎస్సీ కమిషన్‌లో మెంబర్‌షిప్ ఇప్పిస్తానని నమ్మించి రూ.2 లక్షలు తీసుకుని మోసగించిన షేక్ జబ్బార్‌పై దర్గామిట్ట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు నగరంలోని దర్గామిట్ట ప్రాంతంలో గ్రీన్ మెడోస్ అపార్ట్‌మెంట్‌లో మాల్యాద్రి అనే కాంట్రాక్టర్ నివాసం ఉంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం మాల్యాద్రికి గుంటూరుకు చెందిన షేక్ జబ్బార్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఇటీవల ఎస్సీ కమిషన్ మెంబర్ షిప్ ఇప్పిస్తానని జబ్బార్.. మాల్యాద్రిని నమ్మించి రూ.2 లక్షలు ఖర్చవుతుందని చెప్పి తన భార్య బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేయించుకున్నాడు. రోజులు గడుస్తున్నా మెంబర్‌షిప్ ఇప్పించకుండా, తీసుకున్న డబ్బులు చెల్లించకుండా, సమాధానం సైతం చెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. మాల్యాద్రి తాను మోసపోయానని గ్రహించి జబ్బార్, అతని భార్య రాగ చంద్రికపై మంగళవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిదంపతులకు రావణ సేవ


తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదిదంపతులైన స్వామి, అమ్మవార్లకు మంగళవారం రావణసేవ నిర్వహించారు. ఉదయం దీక్షాహోమం, బలిహరణ పూజ, తిరుచ్చి ఉత్సవం, విశేష పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. శివ భక్తుడైన రావణాసురుడు అహంకారంతో కైలాసగిరిని లంకకు తీసుకెళ్లాలని పెకలించుచుండగా గమనించిన ఈశ్వరుడు ఉగ్రరూపం దాల్చి కైలాసగిరిపై శివతాండవం చేసి రావణాసురుడు అహంకారాన్ని అణచాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాల్లో ఆదిదంపతులకు రావణసేవ నిర్వహిస్తారు. రావణుడు వాహనంగా స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన చెవిరెడ్డి సురేంద్రరెడ్డి – శైలజారెడ్డి దంపతులు, దామరమడుగు గ్రామానికి చెందిన పలగాని సంజీవ్ కుమార్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి ఉభయదాతలుగా వ్యవహరించారు.

నేడు వెండి నందిసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మల్లికార్జునస్వామి వెండి నందివాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం గిన్నెభిక్ష గ్రామోత్సవం, రాత్రికి వెండినంది సేవ నిర్వహించనున్నారు.

నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి: రూ. 52
సన్నవి: రూ. 22
పండ్లు: రూ. 15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	142
లేయర్ (లైవ్) :	95
బ్రాయిలర్ చికెన్ :	244
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	270
లేయర్ చికెన్ :	162